


కారుణ్య నియామక పత్రం అందజేత


అలెక్స్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ బ్లెసెన్‌జీవన్ సోదరుడు సుంకర అలెక్స్ జీవన్‌కు కారుణ్య నియమాక పత్రాన్ని అందజేశారు. శనివారం వాడపాలెంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు చేతుల మీదుగా ఈ పత్రాన్ని అందజేశారు. కారుణ్య నియమాకలలో భాగంగా అలెక్స్‌జీవన్‌ను రామచంద్రపురం జూనియర్‌కాలేజీలో జూనియర్ అసిస్టెంట్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు దోపిడీ

- ల్యాబ్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్ల ఇష్టారాజ్యం
- అర్హత లేకున్నా పరీక్షలు.. విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ
- లబోదిబోమంటున్న రోగులు



ప్రజాశక్తి - రాజోలు

రాజోలు కు చెందిన ఓ వ్యక్తికి జ్వరం రావటంతో ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యుడు రోగి లక్షణాలు తెలుసుకోకుండానే ప్యాకేజీ పరీక్షలు చేయించుకోవాలని చీటీ రాసి పంపారు. అందులో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లేట్, మధుమేహం ఇలా అన్ని రకాల పరీక్షలు ఉన్నాయి. అన్నింటికీ కలిపి రూ.2200 వసూలు చేశారు. తీరా చూస్తే సాధారణ జ్వరం అని మందులిచ్చి పంపేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో జరుగుతోంది.

జిల్లాలో ల్యాబ్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటింపు నీళ్లపై రాతలే.! ఆయా సెంటర్లలో కనీసం ధరల పట్టికలు కూడా ఉండవు. చిన్న ఆరోగ్య సమస్య తలెత్తిన వైద్యులను సంప్రదించడం.. వెనువెంటనే రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయించడం తప్పనిసరిగా మారుతోంది. దీనిని ఆసరాగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. జిల్లాలో సుమారు చిన్నా, పెద్ద ప్రయివేటు ఆసుపత్రులు వందల సంఖ్యలో ఉన్నాయి. కొన్ని ఆ సుపత్రులకు అనుబందంగా ల్యాబ్‌లు నిర్వహిస్తుండగా, మరికొన్నింటిని సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 200కు పైగా ల్యాబ్‌లున్నట్లు అంచనాలున్నాయి. సీటీ స్కానింగ్‌ల పేరిట భారీ మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. స్కానింగ్ రెఫర్ చేసిన డాక్టర్లకు స్కానింగ్ సొమ్ములోనూ కమీషన్లు ఇస్తున్నారు. అవసరం లేకున్నా స్కానింగ్‌లు చేస్తున్నారు. ఆర్‌ఎంపీల మాటలతో నర్సింగ్ హోంలకు వస్తున్న జ్వరపీడితులకు అవసరం లేని పరీక్షలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పరీక్షల పేరిట వసూలు చేసిన సొమ్ములో ఆర్‌ఎంపీలకు కమీషన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అధిక శాతం ల్యాబ్‌లలో వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన నియమావళిని పాటించిన దాఖలాలు ఉండడం లేదు. అధికారులు తనిఖీలు చేస్తున్నప్పటికీ ల్యాబ్‌ల నిర్వాహకుల అక్ర మాలు ఆగడం లేదు. దీంతో ప్రతీ నిత్యం రోగులు రూ. వేలల్లో ఫీజులు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

అనుమతితో కొన్ని...లేకుండా మరికొన్ని..

జిల్లా క్రేందమైన అమలాపురం, రావులపాలెం, మలికిపురం, రాజోలు, తాటిపాక, రామచంద్రపురం, మండపేట లాంటి ప్రధాన పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం సుమారు రెండు వందలకు పైగా ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా రిజిస్ట్రేషన్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వ హిస్తున్న ఆసుపత్రుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందన్న ఆరోపణలున్నాయి. అనుమతి పొందిన ఆసుపత్రులకు అనుబందంగా కొన్ని ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్నింటిని ఆసుపత్రులకు సంబంధం లేకుండా స్వతంత్రంగా కొందరు వ్యక్తులు ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నారు.

ప్రయివేటు ఆసుపత్రుల వివరాలు ఇవి..

జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రులు -146
అనుమతులు లేని(రెన్యూవల్) కాని ప్రయివేటు ఆసుపత్రులు- 60,
అనుమతులున్న ప్రయివేటు ల్యాబులు- 67
అనధికారిక ల్యాబ్‌లు దాదాపు-100(సుమారుగ)

అమలు కాని నియమావళి

జిల్లాలో చాలా ల్యాబ్‌లలో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలంటే నిబంధనల ప్రకారం నిర్ణీత అర్హతలు గల వైద్యులు తప్పనిసరిగా ఉండాలి. ప్రతీ ల్యాబ్ వైద్యుని పర్యవేక్షణలో నిర్వహించాలి. చిన్నపాటి ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నా కనీసం ఎంబిబిఎస్ అర్హత గల వైద్యుడి పర్యవేక్షణ ఉండాలి. పెద్ద పెద్ద స్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలంటే ఫాథాలోజిస్టు, రేడియాల జిస్టు, మైక్రోబయోలాజిస్టు తదితర అర్హత గల వైద్యుడు ఉండాలి. వీరికి సహాయకులుగా ల్యాబ్ టెక్నీషియన్లు వ్యవహరించే వీలుంది. ల్యాబ్ నిర్వహణకు డిప్లొమా, డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వ్యక్తులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కాగా జిల్లాలో చాలా చోట్ల ప్రయివేటు ఆసుపత్రులకు అను బంధంగా పలు ల్యాబ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత ఆసుపత్రి వైద్యుడి పేరిట ఇతర వ్యక్తులే నడుపుతున్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు మెడికల్ ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పలు వురు వ్యక్తులు ఆసుపత్రులకు అనుబంధంగా లేకుండా ల్యాబ్‌లు పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకంగానే నిర్వహిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడా ఇరుకుగదుల్లో ల్యాబ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పరీక్ష ఫీజులు తెలియజేసే బోర్డులు కూడా ప్రదర్శించడం లేదు. ల్యాబ్‌లలో బోర్డులను ప్రదర్శించడం లేదు. ఒకవేళ ప్రదర్శించినప్పటికీ బోర్డుపై ఒక డాక్టర్ పేరుంటే పరీక్షలు మాత్రం ఇతర అర్హతలు లేని వ్యక్తులు చేస్తున్నారు. కొన్ని ల్యాబ్‌లలో బోర్డులపై అసలు ఏ డాక్టర్ పరీక్ష సేవలు అందిస్తారో కూడా వివరాలు ఉండడం లేదంటే అతిశయోక్తి కాదు. సరిపడా ఫర్నీచర్, తాగు నీరు, మూత్రశాల, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం తదితర కనీస సౌకర్యాలు కూడా లేని ఆసుపత్రులు,ఇతర ప్రాంతాల్లో విచ్చలవిడిగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. ఇవి కార్పొరేట్ స్థాయి ఫీజులను వసూలు చేస్తున్నాయి. రోగులకు ఇస్తున్న వివిధ ల్యాబ్ టెస్ట్‌లకు సంబంధించి సరియైన బిల్లులు ఇవ్వడం లేదు.

మెడికల్ ల్యాబ్‌ల దందా..

జిల్లాలో మొత్తం సుమారు 200 వరకు ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిలో చాలా ల్యాబ్‌లకు అసలు అనుమతులే లేవని అధికారులే వెల్లడిస్తుండడం గమనార్హం. అర్హత లేని వారు అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అందినకాడికి దోచుకుంటున్నారు. రాజోలు,అమలాపురం నియోజకవర్గాలలో అనధికారిక మెడికల్ ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అవసరం ఉన్న లేకున్నా టెస్ట్‌లను వైద్యులు సూచించడంతో అందినంతా దండుకుంటున్నాయి. రూ. వందలు, వేలల్లో ఫీజులు లాగుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పరీక్షలు చేయించుకుంటే మీకే మంచిదని వైద్యులు ఉచిత సలహాలు ఇస్తున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినా వీరి దోపిడి సాగుతూనే ఉంది.వైద్యులకు కమీషన్లు ముట్టజెప్పుతూ అక్రమంగా దందా నిర్వహిస్తున్నారనే విమర్శ వ్యక్తం అవుతోంది.

కేసుల పురోగతిపై ఎస్‌పి సమీక్ష


మాట్లాడుతున్న ఎస్‌పి రాహలల్ మీనా

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో కేసుల విచారణ పురోగతి తదితర అంశాలపై కోర్టు కానిస్టేబుళ్లతో ఎస్‌పి రాహుల్ మీనా శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సమర్థవంతమైన విచారణ కోర్టు కేసులలో ఆలస్యం జరగకుండా, వేగవంతంగా న్యాయం జరిగేలా కానిస్టేబుళ్లు తమ బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ కోర్టు కేసులు, చార్జ్ షీట్లకు సంబంధించిన విషయాలపై కానిస్టేబుళ్లను ప్రశ్నించారు. ఈ రికార్డుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోర్టు డ్యూటీల నిర్వహణలో కానిస్టేబుల్స్ ఎదుర్కొంటున్న వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు కోర్టులకు చెందిన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ పుల్లారావు, డిసిఆర్‌బి సిఐ.మురళీకృష్ణ సోషల్ మీడియా సిఐ తమ్మినాయుడు, కోర్ట్ మానిటరింగ్, ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి పార్టనర్ సమ్మిట్ వేదిక

విశాఖలో పెట్టుబడిదారులతో పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ చర్చలు


చర్చలు జరుపుతున్న ఎంఎల్‌ఎ గిడ్డి

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి విఖాఖలో జరిగిన పార్టనర్ సమ్మిట్ ముఖ్యమైన వేదికగా నిలిచిందని ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గ అబివృద్ధికి అవసరమైన పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం రంగాల పురోగతి, యువతకు ఉపాధి అవకాశాల పెంపు వంటి అనేక అంశాలపై శనివారం ఆయన పెట్టుబడిదారులతో పరస్పర చర్చలు జరిపారు. విశాఖలో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ ప్రాంగణంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో 32వ పార్టనర్ సమ్మిట్-2025లో ఎంఎల్‌ఎ గిడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాలు పెంపు వంటి అనేక రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే అవకాశాలపై చర్చించడానికి ఈ సమ్మిట్ ప్రత్యేక వేదికగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బహుళ జాతి కంపెనీలు, పరిశ్రమలు-సాంకేతిక రంగ నిపుణులు ఈ సమ్మిట్ లో పాల్గొన్నారని తెలిపారు. ఈ సమ్మిట్‌లో నియోజకవర్గంలో ఉన్న వనరులను వినియోగించుకునే దిశగా పరిశ్రమల ప్రతినిధులతో అమూల్యమైన సూచనలు స్వీకరించారన్నారు. నియోజకవర్గ అబివద్ధి దిశగా కొత్త పెట్టుబడులు, ఒప్పందాలు, భాగస్వామ్యాలు, పెంచుకునేందుకు ఈ వేదిక ముఖ్యపాత్ర పోషించిందన్నారు. ఎంఎల్‌ఎ వెంట జనసేన సీనియర్ నాయకులు కెఎం.రజా(రజ్వి) తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి లంకలో శనివారం అమలాపురం పట్టణానికి చెందిన రోహిణి చిన్నపిల్లల ఆసుపత్రి వార ఉచిత వైద్యశిబిరం సర్పంచ్ కుమ్మరి మాధవిరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ వివిఎస్ఎన్.మూర్తి చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దాసరి శైలజ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


జార్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు

వంగలపూడి కుటుంబానికి దేశంశెట్టి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఉప్పలగుప్తం పంచాయతీ మధురపేటకు చెందిన ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు వంగలపూడి జార్జి ఇటీవల మృతి చెందారు.ఆ కుటుంబాన్ని శనివారం జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు పరామర్శించారు. జార్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జి కుమారుడు నరసింహమూర్తి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు అయితాబత్తుల అజయ్ సింగ్, మధుర నరసింహమూర్తి, మధుర ప్రతాప్, కుంచే మోహన రావు, కాగిత సత్యనారాయణ, నాగారపు అర్జునరావు, నెల్లి సాయిబాబు తదితరులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కులో ఈనెల 20 తేదీ నుంచి నిర్వహించే మార్షల్ ఆర్ట్స్ ఉచిత శిక్షణ పోస్టర్‌ను వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆవిష్కరించారు. గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అవగాహన


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమర్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

అమలాపురం: ప్రతీ వ్యక్తి తన వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గాంధీ మున్సిపల్ హై స్కూల్ నందు అవగాహనా సదస్సును నిర్వహించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం బాషా, హెచ్ఎం గణ సత్య నారాయణ, మున్సిపల్ అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం విద్యార్థినులు ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిని కొంతమేర బహిర్భూమిగా స్థానికులు ఉపయోగిస్తున్నారు. దీంతో దుర్గంధం వల్ల విద్యార్థినిలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒ డి.కృష్ణ సమస్యను గుర్తించి శనివారం ఆ ప్రాంతంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ నిర్వహించారు. వసతి గృహం విద్యార్థినులతో ఆ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల విసర్జన ద్వారా కలిగే దుష్ఫలితాలను వివరించి అవగాహన కల్పించారు. రహదారిపై వసతి గృహం పరిసరాలలో బహిరంగ మలవిసర్జన చేయడం ద్వారా ప్రతిరోజు తాము పడుతున్న ఇబ్బందులను వార్డెన్ రోజా పుష్ప, వసతి గృహం విద్యార్థినిలు సర్పంచ్ శ్రీదుర్గ, ఎంపిడిఒ కృష్ణ లకు వివరించారు. ఎవరైతే మరుగుదొడ్లు లేకుండా ఉండి ఆరుబయట మల విసర్జన చేస్తున్నారో ఆ కుటుంబాలను గుర్తించి అవగాహన కల్పించి మరుగుదొడ్లు నిర్మించుకునేం దుకు చర్యలు తీసుకుంటానని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని, ఉపాధి ఎపిఒ ఎం.వీరబాబు, టిఎ.దాసు, పంచాయతీ కార్యదర్శి ఎండి. షెహన్ షా, సిహెచ్ఒ జి.చైతన్య ప్రమీల, ఆశా కార్యకర్తలు డి.వరలక్ష్మి, డి.శైలజ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట: మండపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పరిశుభ్రత పట్ల ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం, చింతలపూడి సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ టివి.రంగారావు తదితరులు, పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై గ్రామ సభ నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్ వద్ద ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. అంగర జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత సమాజ పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డిఎల్‌డిఒ మండల ప్రత్యేక అధికారి పివి. విజయలక్ష్మి , ఎంపిడిఒ హెచ్.భానోజీ రావు, డిప్యూటీ ఎంపిడిఒ బి.వర ప్రసాద్, ఇఒపిఆర్‌డి ఆర్ఎం వివిఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మాచవరం గ్రామపంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన నివారణపై అవగాహన కోసం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సుబ్బారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓబి.మమత, ఉప సర్పంచ్ మట్టపర్తి సాంబ, కార్యదర్శి కెవివి సత్యనారాయణ, వార్డు సభ్యులు గోసంగి సత్యనారాయణ, మంచాల ఎర్ర అబ్బాయి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, డ్వాక్రా యానిమేటర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలమూరు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ఆలమూరులో ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ విశ్వప్రసాద్, ఆర్ఐ రమా యమ్మ, ఎపిఒఅరుణ కుమారి, ఎపిఎం వివిఎన్.సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

మామిడికుదురు: పరిసరాల పరిశుభ్రత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ అల్లు విజయలక్ష్మి సూచించారు గోగన్నమఠం హైస్కూల్లో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలోని ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్‌ఎ వేగుళ్ల



గొల్లవిల్లి బాలికల హాస్టల్ వద్ద స్వచ్ఛాంధ్ర దివస్


మాచవరంలో అవగాహన ర్యాలీ లో ఎంపిడిఒ, సర్పంచ్



ఆలమూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ రాజు


మతిస్థిమితం లేనివారిని చేరదీస్తున్న 'మనోబంధు'

పట్టణంలో మనోబంధు ఫౌండేషన్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - అమలాపురం

మతిస్థిమితం, ఆదరించే వారు లేని, రోడ్లపై తిరుగుతున్న వారిని విశాఖని మానసిక రోగుల ఆసుపత్రికి తరలించడానికి మనోబంధు ఫౌండేషన్ అమలాపురం పురపాలక సంఘం వారి సహకారంతో శనివారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. మానసిక వైకల్యంతో బాధపడుతూ, ఆదరణ లేక, రోడ్లపై తిరిగే వారిని ఫౌండేషన్ వారు, అమలాపురం పురపాలక సంఘ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి వద్ద మానసిక వైకల్యంతో బాధపడుతూ, రోడ్డు పక్కనే పడుకుని అత్యంత దుర్భర స్థితిలో ఉన్న వ్యక్తిని విశాఖలోని మానసిక రోగుల ఆసుపత్రికి తరలించారు. అలాగే పట్టణంలో అనేక ప్రాంతాల్లో పరిశీలించి, రోడ్లు పై తిరుగుతున్న వారిని గుర్తించారు. వారి మానసిక, ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆదరించే వారు లేక రోడ్ల పైన తిరుగుతున్న, నిరాశ్రయులైన వారిని గుర్తించారు. వారిని స్వచ్ఛంద సంస్థల వారు నిర్వహిస్తున్న షెల్టర్లలో చేర్చడానికి మాట్లాడారు. కార్యక్రమంలో మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు ఎల్.బాల సురేష్, ఎస్.ఫణి శ్రీ, బి.నారాయణరావు, అమలాపురం పురపాలక సంఘం తరపున స్పెషల్ డ్రైవ్ నోడల్ ఆఫీసర్ బండి వీరన్న, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ వై.రత్న ప్రసాద్, సెక్రటరీలు సిహెచ్ఎల్.నాగేంద్ర ప్రసాద్, వి.సతీష్ పాల్గొన్నారు.

నేడు శెట్టిబలిజ వన సమారాధన

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కొంకాపల్లి సత్తెమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం నిర్వహించే శెట్టిబలిజల 4వ కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సుభాష్, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణరావు, సంఘ పెద్దలు వాసంశెట్టి సత్యం, ఇతర సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం శుక్రవారం అమలాపురంలో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సంఘ నాయకులతో కలిసి మంత్రి సుభాష్ మాట్లాడారు. స్వల్ప వ్యవధిలో ఈ వన సమారాధన నిర్వహిస్తున్నామని, ఇదే మా ఆహ్వానంగా భావించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన శెట్టి బలిజ నాయకులు, సంఘీయులు ఆత్మీయ సమ్మేళనంకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యఋషి, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

రైతు బజార్లలో బోర్డుపై ప్రదర్శించిన ధరల కన్నా ఎక్కువ ధరలకు రైతులు వినియోగదారులకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ హెచ్చరించారు. శనివారం స్థానిక రైతు బజార్ నందు ఇటీవల పలు ప్రచార మాధ్యమాలలో వస్తున్న ఫిర్యాదుల పట్ల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, వినియోగదారులతో మాట్లాడుతూ ఫిర్యాదుల పట్ల నిత్యావసర ధరలు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా దుకాణదారులు నిబంధనలు విరుద్ధంగా ధరలు పెంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు బజార్లలో నిర్ణయించిన లేదా ప్రదర్శించిన ధరలకు మాత్రమే వినియోగదారులకు విక్రయించాలన్నారు. రైతు బజార్లలో ధరల వ్యవస్థ మార్కెట్ యార్డ్ రెగ్యులేషన్ వ్యవస్థ ప్రకారం నియంత్రితమవుతుందనీ, ఇందుకు వ్యతిరే కంగా వ్యవ హరించే వ్యక్తులపై లైసెన్స్ రద్దు, జరిమానాలు విధిస్తారన్నారు.

వరప్రసాద్ సేవలు అభినందనీయం


ఉపాధ్యాయుడు వరప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కషి చేసిన ఉపాధ్యాయుడు లక్ష్మీ కృష్ణ నాగవరప్రసాద్ సేవలు అభినందనీయమని ఎంఇఒ పివి.ప్రసాదరావు అన్నారు. శనివారం తాడిపూడి మండల ప్రజా పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎస్‌వివి ఎన్ఎస్.ప్రసాద్ అధ్యక్షత జరిగిన వరప్రసాద్ సన్మాన సభ నిర్వహించారు. తాడిపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో 8 ఏళ్ల పనిచేసిన వరప్రసాద్ మండపేట మండలం వేములపల్లికి బదిలీ అయ్యారు. ఎంఇఒ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక జూనియర్ కళాశాల 1973-75 విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, పారిశ్రామికవేత్త కుంపట్ల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బండారు మాట్లాడుతూ తాను చదువుకున్న విద్యాసంస్థ స్వర్ణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాల నుంచి చదువుకున్న ఎంతోమంది నేడు ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవలు అందించడం గర్వకారణమన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. స్వర్ణోత్సవ కమిటీ నిర్వాహకులు ఎంఎల్‌ఎ బండారును దుశ్శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సాగులో మేలైన యజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త, జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా దళ్వా సీజన్‌లో వరి సాగు సుమారు 1.67 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అన్నారు. రైతులు దళ్వా సీజన్‌లో అనువైన ఎంటియు 1121, ఎంటి యు 1426, ఎంటియు 1293 రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ రకాలు సన్నాలకు చెందినవని, ఇవి అగ్గి తెగుళ్ల తట్టుకుని, రాలిక లేకుండా అధిక దిగుబడులు ఇస్తాయన్నారు.

పరిహారం ఎప్పటికి అందేనో..?



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావంతో అన్నదాతలు ఆశలు అతలాకుతలమయ్యాయి. లక్షలాది ఎకరాల్లో పంటను కోల్పోయారు. నష్టం వాటిల్లి 20 రోజులైనా నేటికీ వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. పంటనష్టపోయిన రైతన్నలు సర్కారు సాయం కోసం దీనంగా ఎదురు చూసున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటలు అక్షరాలా 1.74 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఆరుగాలం పండించిన రైతన్న కష్టం ఒక్కసారిగా ఆవిరైపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. తుపాను అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి పర్యటన తప్ప రైతులకు ఎటువంటి స్పష్టమైన భరోసా లభించలేదు. తుపాను అనంతరం ఎన్యూమరేషన్ ప్రక్రియపైనా పలు విమర్శలు వినిపించాయి. ఎన్యుమరేషన్ ప్రక్రియ మొక్కుబడిగా సాగిందని అన్నదాలు గగ్గోలు పెట్టారు. ఎన్యుమరేషన్ ప్రక్రియకు ముందే ఒకసారి పంట నష్టంలో లెక్కిస్తే ఆ ధాన్యం కొనుగోలు చేయబోమని అధికార యంత్రాంగ చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు .33 శాతానికిపైగా పంట నష్టం జరిగితేనే నష్టం జాబితాలో చోటు దక్కింది. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగలేదు. కనీసం పంట నష్టం అయినా సకాలంలో అందించి ఆదుకుంటారని భావించిన అన్నదాతలకు నిరాసే ఎదురైంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసి వారం రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా రైతాంగం సుమారు రూ.250 కోట్లకు పైగా నష్టపోయినట్లు అంచనా. కేంద్రం బృందం వచ్చి జిల్లాకు రెండు మూడు గ్రామాల్లో మాత్రం పర్యటించి వెళ్లిపోయింది. నష్టంపై ముఖ్యమంత్రితో మాట్లాడి నివేదిక అందిస్తామని మాత్రమే చెప్పింది. కొన్ని ప్రాంతాల రైతులకు కేంద్ర బృందం వచ్చినట్టు కూడా తెలీని పరిస్థితి. పలుచోట్ల అన్నదాతలు ఈ బృందానికి వినతిపత్రాలు అందించారు. కాని వాటిని పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కానరాలేదు.

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగును కష్టాలు నీడలా వెను వెంటే ఉన్నాయి. తొలుత అకాల వర్షాలు, ఆపై యూరియా కష్టాలు చివరికి మోంథా తుఫానుతో రైతన్నను వెన్ను విరిచాయి. అయితే పై మూడు దశలలోనూ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడకపోగా ప్రభుత్వ యంత్రాంగం భిన్నంగా వ్యవహరించిన తీరు ఆందోళనకు గురి చేసింది. యూరియా కొరత సమస్యను పరిష్కరించకపోగా రైతులు అధికంగా కొనుగోలు చేశారని, కొద్ది మంది వద్ద ఈ నిల్వలు అధికంగా ఉండటం, ఉద్దేశ పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ చేసిన వాఖ్యలు పాలకుల చిత్తశుద్ధిని దర్పణం పట్టాయి. తాజాగా ధాన్యం కొనుగోలులోనూ నిర్లక్ష్యం వెంటాడుతోంది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించటంతో రైతులను దళారులను ఆశ్రయించక తప్పలేదు. ప్రభుఎత్వం ప్రకటించిన మద్దతు ధరకు బస్తా రూ.400 నుంచి రూ.300 తక్కువకు వ్యాపారులు యదేచ్ఛగా కొనుగోలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ప్రకటించిన హామీ సైతం నేటికీ ఆచరణలో అమలుకు నోచుకలేదు. తుపాను నేపథ్యంలో తేమ శాతం నిబంధనలను సడలిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి తక్షణమే పంటనష్ట పరిహారం అందజేయాలని రైతులు వేడుకుంటున్నారు.

మరోపక్క జిల్లాపై చలి పులి పంజాను విసిరింది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకంటే తక్కువగా నమోదవుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలి వస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులతో పాటు అమలాపురం ఆస్పత్రిలోనూ రోగుల సంఖ్య పెరిగింది. చలి తీవ్రతతో హాస్టల్ విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దుప్పట్లు కూడా లేకపోవడం, కొన్ని వసతి గృహాలకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో చలికి వణుకుతూనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి.

నేరాలు ఘోరాలు



ఘటనా ప్రాంతంలో భాస్కరరావు మృతదేహం

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంపన భాస్కరరావు(60) మృతి చెందాడు. బాలాంత్రం నుంచి బైకుపై వస్తున్న విత్తనాల శివ, భాస్కరరావులను యానాం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కరరావు ఘటనా స్థలంలో మృతి చెందాడు. గాయపడిన విత్తనాల శివను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి గొల్లప్రోలు

ఒక మహిళ అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దుర్గాడ గ్రామానికి చెందిన ఉగ్గిరాల వీరబాబుకు తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన నాగ దుర్గ వెంకటలక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి పిల్లలు లేరు. ఈ నెల 11న పనికి వెళ్లిన వీరబాబు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య వెంకటలక్ష్మి కనిపించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు చుట్టుపక్కల గ్రామాల్లో బంధుమిత్రులు ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకష్ణ తెలిపారు

8 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస బాలాజీ ఆధ్వర్యంలో శనివారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. పురుషోత్తపట్నం కాలనీ బస్టాండ్ వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కటికల శ్రీనును అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుని కోర్టులో హాజరు పరుస్తామని ఎక్సైజ్ సిఐ తెలిపారు.

హుండీల దొంగలకు రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, తాడిపర్రు రోడ్డులో, పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లోని హుండీల చోరీ కేసులో పిందితులు నక్కపల్లికి చెందిన అనుమాను శ్రీను, ఉండ్రాజవరానికి చెందిన మరో మైనర్‌ను ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్ అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు.

యానాం సిఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - యానాం

యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ పుదుచ్చేరి ఐజి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో కేసులో ఒక నిందితుని పుదుచ్చేరి తీసుకుని వెళ్లి తిరిగి వస్తుండగా వచ్చే దారిలో మద్యం తాగి డ్యాన్సులు చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయం ఐజి అజిత్ కుమార్ దృష్టికి వెళ్లింది. దీంతో సిఐ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ మాహే పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియోపై సిఐ అడలరసన్ స్పందిస్తూ మద్యం సేవించలేదని, డ్యూటీలో ఉన్న అయ్యప్ప స్వామి మాల వేసుకున్న కానిస్టేబుల్ తెచ్చుకున్న మజ్జిగను గ్లాస్‌లో వేసుకుని తాగుతూ డాన్స్ చేశానని వివరణ ఇచ్చారు.



మాట్లాడుతున్న తెన్నేటి కిషోర్

వైసిపి క్రెడిట్‌ను చోరీ చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజోలు

గత వైసిపి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామీకరణ ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్నట్టుగా చెబుతూ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని వైసిపి స్టేట్ అధికార ప్రతినిధి ప్రచార విభాగం తెన్నేటికిషోర్ విమర్శించారు. శనివారం రాజోలు లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో డేటా సెంటర్ మేము తీసుకొచ్చామని,వాళ్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. అదేవిధంగా మూడు లక్షల ఇళ్లకు ప్రారంభోత్సవం చేస్తున్నామని ప్రచారం చేసుకుంటారన్నారు. క్రెడిట్ చోరీకి పాల్పట్టం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. కచ్చితంగా రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మట్టా ఏడుకొండలు, చింతా శ్రీనివాస్, మట్టా మత్తయ్య, ఉప్పటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరికి ప్రజాబంధు పురస్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు శనివారం మోడరన్ ఫౌండేషన్ తరపున ప్రజాబంధు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జివి.రావు మాట్లాడుతూ మాజీ సిఎం ఎన్‌టిఆర్ కుమార్తెగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన వాణి వినిపించిన ఎంపీ పురందేశ్వరి తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. మోడరన్ ఫౌండేషన్ తరపున ఆమెకు పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జివి.రావుతో ఎన్‌టిఆర్ ట్రస్టుకు గల అనుబంధాన్ని ఎంపీ గుర్తుతెచ్చు కున్నారు. కార్యక్రమంలో కర్రి చిట్టిబాబు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలలతో మహిళలు

వాసాలరేవులో తాగునీటికి కటకట

▶ 3 నెలలుగా తీరని సమస్య ▶ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని గోదావరి చెంతన గల మత్స్యకారుల గ్రామమైన వాసాలరేవులో మూడు నెలలుగా మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి ట్యాంకు సరిగా నింపకపోవడంతో మంచి నీరు గ్రామస్తులకు సరిపోవడం లేదు. సెప్టెంబర్‌లో పూర్తిగా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అప్పుడు గ్రామపంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆందోళనకు చేశారు. దీనిపై సెప్టెంబర్ 30న తాగునీటి కటకట శీర్షికన 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురతమైంది. దీనిపై స్పందించిన అధికారులు నాలుగు రోజులపాటు తాగునీటి ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేశారు. అనంతరం వాటర్ ట్యాంకు బాగు చేస్తామని చెప్పినా అది ఆచరణ సాధ్యం కాలేదు. దంగేరులో సుమారు రూ.6 కోట్లతో తాగునీటి పథకాన్ని 2014లో ప్రారంభించారు. అయితే నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాటూ ఇక్కడ గల మంచినీటి చెరువును పూర్తిగా నింపకపోవడంతో తాగునీరు సరఫరాలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీంతోపాటు ఫిల్టర్ బెడ్లు సరిగా లేక మురుకినీరు సరఫరా అవుతోంది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టిం చుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం కేవలం ఒక గంట సేపు తాగునీరు ఇవ్వడం వల్ల పగలంతా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాటర్ ట్యాంకును పూర్తిగా నింపి మంచినీరు అందరికీ సరిపడ సరఫరా చేయాలని గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులో లేని అధికారులు

వాసాలరేవులో తాగునీటి సరఫరా నిలిచిపోయినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దీనిపై స్పందించడం లేదని గ్రామస్తుడు దోమ ఆదినారాయణ తెలిపారు.అధికారులు ఎవరూ అందుబాటులో లేరన్నారు. మత్స్యకారుల గ్రామం వాసాలరేవులో ప్రజలంతా తాగునీటి కోసం ఇక్కట్ల గురవుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




ప్రారంభిస్తున్న ఛైర్మన్ వర్రె శ్రీనివాసరావు

నేదునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని నేదునూరు పిఎసిఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ వర్రె శ్రీనివాసరావు శనివారం త్రిసభ్య కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. రైతులు తమ పండించిన పంటలను సొసైటీ ద్వారా విక్రయించుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులకు ఇతరత్రా అనుమానాలు ఏమైనా ఉంటే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.శోభ, సొసైటీ సిఇఒ లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు ఇందుగుల వెంకట రామయ్య, కల్లేపల్లి వెంకట సుబ్బరాజు, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కాకినాడలో బాధితు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

తుపాను ప్రమాద బాధితునికి రూ.2.50లక్షల సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

తుపాను కారణంగా కొబ్బరి చెట్టు విరిగి కాళ్లు విరిగిపోయిన బాధితునికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ శనివారం అందజేశారు. నగరానికి చెందిన కొల్లు దుర్గాప్రసాద్ మొంథా తుపాను రోజున భారీ గాలులకు చెట్టు విరిగి కిందపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో అతనిని కాకినాడ మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్‌ను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.2.50 లక్షలు చెక్కును ఎంఎల్ఎ గిడ్డి అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలంటూ వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా సూచనలు చేశారు. అవసరమైతే భవిష్యత్తులో కూడా ప్రభుత్వం తరపున పూర్తి సహాయం అందిస్తామని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కె ఎం.రజా(రజ్వి) పాల్గొన్నారు

పెదపట్నం లంక లో డెంగీ కేసు

ప్రజాశక్తి-మామిడికుదురు

పెదపట్నంలంక ధనమ్మపేటలో డెంగీ కేసు నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు ఈ విషయం తెలుసుకుని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం అప్రమత్తమయ్యారు. డిఎంఒ నక్క వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ ఆదినారాయణ గ్రామంలో పర్యటించారు. పరిసరాల్లో జ్వర పీడితుల సర్వే నిర్వహించి ఎబెట్ మందు పిచికారీ చేయించారు ఆయిల్ బాల్స్ వేసి నివారణ చర్యలు చేపట్టారు.



దాతకు స్వామివారి చిత్రపటం బహుకరిస్తున్న సహాయ కమిషనర్ సత్యనారాయణ

రూ.1.40 లక్షలతో దాత అన్నదానం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయ సన్నిధిలో యాత్రికులకు కార్తీక బహుళ ఏకాదశి శనివారం సందర్భంగా రూ.1.40లక్షలతో దాత అన్నదానం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన వాసిరెడ్డి రాధేష్ నాగ వెంకట్ తరపున తాత వాసిరెడ్డి శ్రీనివాస్, తల్లిదండ్రులు వాసిరెడ్డి దుర్గా ప్రసన్నకుమార్, మౌనిక భాగ్యలక్ష్మి దంపతులు, సోదరి కాన్విత్ నాగశ్రీజ, ఉండి మండలం కలిగొట్లకు చెందిన తోట రామకృష్ణ, రమాదేవిదంపతులు, కుటుంబ సభ్యులు ఆలయంలో యాత్రికులకు అన్న దానం నిర్వహించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ముందుగా వీరు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చక స్వాములు శేషవస్త్రం, తీర్థ ప్రసాదం, అనంతరం వేదాశీర్వచనం అందజేశారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని శనివారం హైదరాబాద్‌కు చెందిన ఉద్దరాజు బంగారురాజు , శివాని దంపతులు కుటుంబ సమేతంగా దర్శించికున్నారు. అనంతరం నిత్యాన్నదాన నిధికి రూ.10,001 విరాళంగా ఇచ్చినట్లు ఇఒ సతీష్ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 14 వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. **కొత్తపేట:** విద్యార్థులు పుస్తకపఠనంపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఇఒ ఎం.హరిప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎంఇఒ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎకెవి.కృష్ణ, కె.సుధాకర్, కె.కామాక్షి, నూక పేయి శివరత్నం, తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం**: పేరవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్షలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.రిటైర్డ్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముత్యాల సూర్య నారాయణ పుసక్త ప్రదర్శన ప్రారంభించారు **రామచంద్రపురం:** స్థానిక గ్రంథాలయాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్.రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి వి.నాగేశ్వరి, లైబ్రేరియన్ జివివి ఎస్.త్రినాథ్, గ్రంథాలయ ఉద్యోగులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల కు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. **ఉప్పలగుప్తం.** ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయాల లో గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషు కుమార్‌ల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంఇఒ ఎస్.సత్యకృష్ణ, రిటైర్డ్ పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వర రావు, హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, సిఎస్ఎం కాలేజీ ప్రిన్సిపల్ కె.బాలాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. **మామిడికుదురు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశామనిని గ్రంథాలయ నిర్వహణాధికారి కెవిఆర్.సూర్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఈదరాడ బిడిసి యెరుబండి కన్నబాబు, జవహర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి దానేటి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన లో సర్పంచ్ సాకా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు కార్యక్రమంలో వి ఆర్ ఓ ఎస్.సత్య నారాయణ, కార్యదర్శి శివ చక్రవర్తి, సిహెచ్ నాగేంద్ర ప్రసాద్, పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి - మండపేట

గుంటూరులో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందినట్లు ద్వారపూడి ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ద్వారపూడి బాలుర జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేస్తు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ ఆహ్వానం రావడం సంతోషంగా ఉందని అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్ర సారస్వత పరి షత్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2026 జనవరి 3,4,5 తేదీల్లో గుంటూరులో ఈ సభలు నిర్వహి స్తారని అన్నారు. ఈ సందర్భంగా. సుబ్రమణ్యంను హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మ ణ్యం, ఇన్‌ఛార్జి గుణం శివభాస్కర్, సంస్కృత పండితులు గొర్తి సుబ్రహ్మణ్య శర్మ, కవి రచయిత బండారు రాము అభినందించారు.

ఘనంగా దువ్వూరి సుబ్బమ్మ జయంతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్వాతంత్ర్య సమర యోధురాలు దువ్వూరి సుబ్బమ్మ 145వ జయంతిని శనివారం ద్రాక్షారామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నియోజకవర్గం ఎంబిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుబ్బమ్మ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి లేఖ రాస్తానని ఆయన ఈ సందర్భంగాద తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల రమణ శాస్త్రి, మేడిశెట్టి శ్రీనివాస్, కొప్పిశెట్టి కొండలరావు, షేక్ అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

రీ సర్వేలో లోపాలుంటే దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఎపి రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా రీ సర్వే అనంతరం తయారుచేసిన డ్రాఫ్ట్ రికార్డులు ప్రచరణ, అభ్యంతరాల స్వీకరణలో ఏమైనా లోపాలుంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం ఆర్‌డిఒ డి .అఖిల అన్నారు. శనివారం టేకి గ్రామపంచాయతీ కార్యాల యం లో వీటి పై నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మేర్లపాలెం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలను కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పరామర్శించారు. నిరాశ్రయులైన ములగలేటి వెంకన్న, కొమ్మర సుబ్బలక్ష్మి, ములగలేటి సంతోషం కుటుంబాలకు ఎంఎల్ఎ స్వీయ నిధుల నుంచి నగదు సహాయం, బియ్యం మరియు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.